
క్రీడలే ఆశగా.. శ్వాసగా..




ఆటో బోల్తా.. ఇద్దరి మృతి..



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ కేరళలో పర్యటించారు. ఈ సందర్భంగా అడూర్ నియోజకవర్గానికి వచ్చిన రాహుల్‌కు హెలీప్యాడ్ దగ్గర జుక్కల్ ఎమ్మెల్యే, అడూర్ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకుడు తోట లక్ష్మీ కాంతారావు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి రాజకీయ పరిస్థితులపై చర్చించారు.





## కలెక్టరేట్‌లో అంబలి కేంద్రం ఏర్పాటు అభినందనీయం: కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కలెక్టరేట్ కు వచ్చే ప్రజల కోసం ప్రతి ఏడాది టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ మేరకు సోమవారం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని సాధారణ ప్రజలు, ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ప్రతినిధులు కృషిచేస్తూ.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## డీసీసీ కార్పొరేషన్ కార్యవర్గ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** డీసీసీ కార్పొరేషన్ కార్యవర్గ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలని కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ సూచించారు నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో భాగంగా ఇటీవల నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు బొబ్బిలి రామకృష్ణ ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యక్షులను బ్లాక్ ఇన్‌ఛార్జీలుగా, ప్రధాన కార్యదర్శులను డివిజన్ ఇన్‌ఛార్జీలుగా ఇంఛార్జీలుగా, కార్యదర్శులను కో-ఇన్‌ఛార్జీలుగా బాధ్యతలు అప్పజెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి నుంచి కమిటీలోని సభ్యులు వారికి ఇచ్చిన బాధ్యతలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సభ్యులు డివిజన్ అధ్యక్షులను, డివిజన్ కమిటీలను, బూత్ ఏజెంట్లను, బూత్ కమిటీలను, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లను నియమించాలని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి డివిజన్‌లో జరిగే ఏ కార్యక్రమమైనా ఇన్‌ఛార్జీల పర్యవేక్షణలో జరుగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీ నిజామాబాద్ కార్పొరేషన్ కార్యవర్గ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఐపీఎల్ సందడి మొదలైంది. 28 నుంచి ఐపీఎల్ సీజన్ ప్రారంభం కావడంతో.. సాయంత్రం కాగానే యువత టీవీలకు అతుక్కుపోతున్నారు. అయితే ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా పలువురు బెట్టింగ్‌లు పెడతుంటారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్‌లు కాసి అప్పుల పాలు అవుతున్నారు. దీంతో ఈ దందాపై పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.**

– అక్షరటుడే, కామారెడ్డి



# ఐపీఎల్.. బెట్టింగ్‌పై నజర్

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జోరుగా సాగే అవకాశం
- నిఘా పెట్టిన పోలీసులు
- బెట్టింగ్‌లతో అప్పుల పాలు కావొద్దని సూచన

ఐపీఎల్ వచ్చిందంటే చాలు బెట్టింగ్ జోరందుకుంటుంది. బెట్టింగ్ కోసం నిర్వాహకులు ప్రతి ఏటా ఎక్కడికక్కడ ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేస్తుంటారు. బెట్టింగ్ కాసే వాళ్లకు ప్రత్యేక వసతులు కల్పిస్తుంటారని టాక్. ఉమ్మడి జిల్లాలో సైతం బెట్టింగ్ జోరుగా సాగుతుంది. దీంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. బెట్టింగ్ నిర్వాహకులతో పాటు, కాసేవారిపై సైతం ఫోకస్ పెట్టారు.

### చేతులు మారనున్న రూ.కోట్లు

బెట్టింగ్ అంటే ఆషామాషీగా కాదన్న టాక్ ఉంది. గతంలో ప్రతి మ్యాచ్ బెట్టింగ్ వేలు, లక్షల్లో కొనసాగినట్టుగా ప్రచారం సాగుతోంది. దాంతో ఈసారి కూడా బెట్టింగ్ కోసం యువత ఎదురు చూస్తున్నట్టుగా తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ తరహా బెట్టింగ్‌కు కొదవ లేదన్న టాక్ ఉంది. పట్టణ శివారు ప్రాంతాలను ఎంచుకుని అక్కడే బెట్టింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అంతేగాకుండా పలువురు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తున్నారు. ఇంట్లో తెలియకుండా బెట్టింగ్ పెట్టి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. దీని కోసం అప్పులు చేస్తున్నారు. ఆ అప్పులు తీర్చలేక పలువురు ఆత్మహత్య సైతం చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి.

### యువతకు సూచనలు

క్రికెట్‌ను ఆటగా ఆస్వాదించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఐపీఎల్ సందర్భంగా బెట్టింగ్‌లు పెట్టి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరుతున్నారు. యువత అనవసరమైన విషయాలపై దృష్టి పెట్టి కెరీర్‌ను నాశనం చేసుకోవద్దని, బెట్టింగులకు పాల్పడి అప్పులపాలు కావద్దని సూచించారు. బెట్టింగ్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

### పోలీసుల హెచ్చరికలు..

ఉమ్మడి జిల్లాలో బెట్టింగ్ జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే యువతపై ప్రత్యేకంగా ఫోకస్ చేయనున్నట్టుగా తెలుస్తోంది. గతంలో బెట్టింగ్ జరిగిన ప్రాంతాలను పోలీసులు కనుక్కునే పనిలో ఉన్నట్టుగా సమాచారం. అయితే పోలీసుల కళ్లుగప్పి బెట్టింగ్ నిర్వహించే ప్రాంతాలను మార్చే అవకాశాలు ఉన్నాయి. వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



## ఫిర్యాదు బాక్సుల ఏర్పాటు చట్టవిరుద్ధం

### టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**అక్షరటుడే, కామారెడ్డి:** నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలు చట్ట విరుద్ధమని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎమ్మెల్యేను నేరుగా కలవకుండా ఫిర్యాదులను పెట్టెల ద్వారా సమర్పించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. సమస్యలను నేరుగా తెలియజేయడం ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కు అని, ఫిర్యాదుల పెట్టె వంటి మధ్యవర్తిత్వ వ్యవస్థను ప్రవేశపెట్టడం పారదర్శకత, జవాబుదారీ తనాన్ని, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని తగ్గిస్తుందన్నారు. అంతే కాకుండా ఫిర్యాదుల పెట్టెలు అధికారిక తపాలా పెట్టెలను పోలి ఉన్నాయని గుర్తు చేశారు. ఫిర్యాదుల పెట్టెల వ్యవస్థల చట్టభద్రతలను పరిపాలన ఆమోదాలను పరిశీలించాలని, ప్రభుత్వ ఆస్తులపై ఏర్పాటు చేసిన పెట్టెలను తక్షణమే తొలగించాలని కోరారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## బైపోలార్ వ్యాధికి అనేక చికిత్స మార్గాలు..


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బైపోలార్ వ్యాధికి అనేక చికిత్స మార్గాలున్నాయని.. సీబీటీ, సైకోథెరపీ, ఫ్యామిలీ కౌన్సెలింగ్, గ్రూప్ థెరపీ లాంటి పద్ధతులతో వ్యాధిని నయం చేయవచ్చని న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ అన్నారు. ఐఎంఏ నిజామాబాద్, తెలంగాణ మెంటల్ హెల్త్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ బైపోలార్ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందూర్ న్యూరో సైకియాట్రిక్ ఆసుపత్రిలో బైపోలార్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ వ్యాధిలో హైపోమానియా, మానియా, డిప్రెషన్ దశలు ఉంటాయని.. ఒక వ్యక్తి కొంతకాలం హైపోమానియా లేదా మానియా దశలో ఉండి, తర్వాత డిప్రెషన్ దశకు లోనవుతాడన్నారు. ఈ దశలు కొందరిలో రోజులు, కొందరిలో నెలలు, ఇంకొందరిలో ఏళ్ల పాటు కొనసాగవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి హరీష్ స్వామి, వైద్యులు శ్రీశైలం, టీ జీవన్ రావు, రమణేశ్వర్ పాల్గొన్నారు.

## డయల్ 100, 112 సిబ్బందికి శిక్షణ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డయల్ 100, డయల్ 112 సిబ్బందికి సీపీ సాయిచైతన్య ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ రెండు వ్యవస్థల పనితీరును మెరుగుపర్చేందుకు సీపీ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల ద్వారా కమిషనరేట్ పరిధిలోని ఎస్సైలు, సీఐలకు, డయల్ 100, డయల్ 112 సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డయల్ 100 లేదా 112కు కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవడంలో సమయపాలన పాటించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించాలని సీపీ సూచించారు. ఈ సందర్భంగా కాల్స్ స్వీకరించడంలో లేదా సమాచారాన్ని క్షేత్రస్థాయి సిబ్బందికి చేరవేయడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను ఎలా పరిష్కరించుకోవాలో నిపుణులు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసే బాధితులతో ఫోన్ రిసీవ్ చేసుకునే సిబ్బంది ఓపికగా, మర్యాదగా వ్యవహరించాలని, వారి నుంచి పూర్తి వివరాలను సేకరించాలని తెలిపారు. కంట్రోల్ రూం సిబ్బందికి, గస్తీ వాహనాల మధ్య సమన్వయాన్ని పెంచడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని నిపుణులు సైతం సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బి.బస్వా రెడ్డి, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ రాజీవ్ కృష్ణ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరీష్ కృష్ణ, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సీఐలు, ఎస్సైలు, పోలీస్ స్టేషన్, రైటర్స్ డయల్ 100 లేదా 112 సిబ్బంది పాల్గొన్నారు.


## పోలీస్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలి



**అక్షరటుడే, ఇందూరు :** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ మాదిరిగానే పోలీస్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇటీవల పోలీసులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. నిజామాబాద్ నగరంలో నడిరోడ్డుపై కానిస్టేబుల్‌ను దారుణంగా హత్య చేశారని, ఇటీవల హైదరాబాద్‌లోనూ దాడులు జరిగాయని గుర్తు చేశారు. అలాగే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడం సంతోషదాయకనన్నారు. గతంలో పెద్దపల్లి లో జంట న్యాయవాదుల హత్య అందరికీ తెలిసిందేనన్నారు. అలాగే ఇటీవల మహిళా అడ్వకేట్ ను హత్య చేయడం, ఇందూరులో కొందరు గుండాలు అడ్వకేట్ సొంత ఇంటిపై దాడి చేయడం.. ఇలా అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో బిల్లు తీసుకురావడం సంతోషకమని స్పష్టం చేశారు.

## గ్రామ, వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వం వచ్చేనెల 2న పంచాయతీలు, మున్సిపాలిటీలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి అనంతరం అధికారులకు పలు అంశాలపై ఆమె కీలక సూచనలు చేశారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తుగానే గ్రామ, వార్డు సభల వేదికలను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లతో సమావేశమై తగు సూచనలు చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించే ప్రదేశాల్లో తగిన నీడ, తాగునీరు వంటి కనీస వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుంచి 10.30 గంటల్లోపు సభలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సభల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా గ్రామ, వార్డు సభల విజయవంతానికి కృషి చేయాలన్నారు. ఇదిలా ఉండగా.. పదోతరగతి పరీక్షా కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహశీల్దార్లకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా నగరంలో ర్యాలీ..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ జిల్లా యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలని శాంతి నెలకొల్పాలని వారు ఆకాంక్షించారు. భారత దేశంలో పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత లేకుండా ధరలు పెరగకుండా కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా కోశాధికారి భక్తవత్సలం, జిల్లా ఉపాధ్యక్షులు శరత్, వెంకట్రాంరెడ్డి, ప్రవీణ్, సీపీఐ నాయకులు వనమాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మాపూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని లక్ష్మాపూర్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ సేవా కార్యక్రమాలు మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వలంటీర్లు స్థానికంగాఉన్న శివాలయం తదితర ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం షీటీం సభ్యులు సుప్రజ, శ్రీశైలం శిబిరాన్ని సందర్శించి వలంటీర్లకు పోక్సో చట్టం, సైబర్ క్రైంలు, ఫొటో మార్పిడి (మార్ఫింగ్) వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఆఫీసర్ రాణి ఆధ్వర్యంలో వలంటీర్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



## అధికారులపై నర్సన్నపల్లి దళితుల ఆగ్రహం

**అక్షరటుడే, కామారెడ్డి:** తమకు గ్రామంలోని ఆలయాల్లో ప్రవేశం చేయిస్తామని హామీఇచ్చి ఉన్నతాధికారులు రాకపోవడంతో పాటు డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలను పంపడంపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకుకలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. పోలీసులు చివరకు ఆర్డీవోతో ఫోన్ మాట్లాడించడంతో దళితులు శాంతించారు. ఈ ఘటన కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామంలో దళితుల పట్ల ఇతర కులస్థులు, సర్పంచ్ చిన్నచూపు చూస్తున్నారని, తమను గ్రామం నుంచి బహిష్కరిస్తారని బెదిరిస్తున్నారని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ముగ్గురిపై కేసు నమోదు కాగా సోమవారం గ్రామానికి కలెక్టర్, ఎస్పీ వచ్చి గ్రామంలోని ఆలయాల్లోకి దళితులను ప్రవేశం చేయిస్తారని అధికారులు సమాచారమిచ్చారు. దాంతో ఉదయమే దళితులు గ్రామంలో ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం 11:30 గంటలకు వస్తారని చెప్పినా ప్రజావాణి, వీసీ వల్ల ఆలస్యం అవుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు వస్తారని తిరిగి సమాచారమిచ్చారు. దాంతో సాయంత్రం వరకు దళితులు వేచి చూశారు. అయినా ఉన్నతాధికారులు రాకపోవడం, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలను గ్రామానికి పంపడంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తామే అధికారుల వద్దకు వెళ్తామని ర్యాలీగా కలెక్టరేట్‌కు పాదయాత్రగా బయలుదేరారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్సై రంజిత్ కుమార్ చేరుకుని దళితులతో మాట్లాడారు. తహశీల్దార్ చేరుకుని ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడించారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు తాను కూడా గ్రామానికి వస్తామని చెప్పడంతో దళితులు వెనుదిరిగారు.

**విద్యార్థులు క్రీడల్లో ఉత్తమంగా రాణించేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నాడు ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల పీడీ మధుసూదన్. వేసవిలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. ఆయన తర్ఫీదులో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.**

– అక్షరటుడే, ఆర్మూర్



# క్రీడలే ఆశగా.. శ్వాసగా..

- క్రీడాకారుల ఉన్నతి కోసం తప్పిస్తున్న పీడీ మధు
- ప్రతిఏటా వేసవిలో ఉచిత శిక్షణ శిబిరాలు
- ఆయన తర్ఫీదుతో రాణిస్తున్న క్రీడాకారిణులు
- తెలంగాణ జట్టుకు కోచ్‌గానూ సేవలు..

డీఎస్సీ 2009లో పీఈటీగా ఎంపికైన మధుసూదన్ కలిగోట ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధుల్లో చేరాడు. అటు తర్వాత 2018లో మగ్గిడి ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి.. ఇటీవల 2024లో పీడీగా పదోన్నతి పొందాడు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా మధు 2009 నుంచి ఇప్పటి వరకు 152 మంది విద్యార్థులు జాతీయస్థాయిలో, 300 విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనడంలో ముఖ్య భూమిక పోషించారు. మగ్గిడి ఉన్నత పాఠశాల నుంచి 20 మంది క్రీడాకారులు 40సార్లు జాతీయస్థాయిలో పాల్గొన్నారు. అదేవిధంగా సుమారు 150 మంది వాలీబాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని తమ సత్తా చాటారు.

### వేసవిలో ఉచిత శిక్షణ...

వేసవిలో సెలవులు ప్రారంభం కాగానే పాఠశాలలో ఆవరణలో ఉచిత వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ విద్యార్థులను క్రీడల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నాడు. ముఖ్యంగా వాలీబాల్ క్రీడలో విద్యార్థులకు శిక్షణనిస్తూ జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించేలా కృషి చేస్తున్నాడు. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లి జిల్లాలో జరిగిన జాతీయ సబ్ జూనియర్ బాలికల వాలీబాల్ తెలంగాణ జట్టుకు కోచ్‌గానూ మధు వ్యవహరించాడు. ఇప్పటివరకు తెలంగాణ జట్టుకు సుమారు పదిసార్లు కోచ్‌గా పనిచేశాడు.

### ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయికి..



మగ్గిడి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. మా స్కూల్‌లో అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టు తరపున ఆడేంత నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారు. పాఠశాల హెచ్‌ఎం, వీడీసీ, గ్రామస్థుల సహకారంతో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాను. మగ్గిడితో పాటు ఇతర గ్రామాల క్రీడాకారులు సైతం ఈ శిక్షణ శిబిరానికి వస్తున్నారు. ఈ యేడు సైతం వేసవిలో శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తే క్రీడాకారులు మరింత ఎదిగే అవకాశం ఉంటుంది.

**– మధుసూదన్, పీడీ, మగ్గిడి ఉన్నత పాఠశాల ఆర్మూర్**

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**అక్షర టుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని ఆజామాబాద్ గ్రామంలో సోమవారం పశువులకు వైద్యాధికారులు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మానస, వెటర్నరీ డాక్టర్లు విజయకుమార్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. మూగజీవాలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక పశు వైద్యాధికారులకు సంప్రదించాలని సూచించారు. నాటు వైద్యం జోలికి వెళ్లవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

## ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుభాష్




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా కె.సుభాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ నాంపల్లి బాలికల జూనియర్ కళాశాల నుంచి పదోన్నతిపై ఆర్మూర్ కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ.. కళాశాల అడ్మిషన్లు, ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా కృషిచేస్తానని పేర్కొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో కల్యాణలక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, జీపీవో నల్లన్న, నాగేంద్ర, వార్డు సభ్యులు ఎట్టెం మల్లయ్య, టేకులపల్లి రాణా, తేలు హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## రెంజర్ల గ్రామంలో..




**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు సర్పంచ్ లావణ్య భూమేష్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నారెడ్డి నరేష్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..



**అక్షరటుడే, ఆర్మూర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా అధ్యక్షుడు ముత్తన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని అంగడిబజార్ చౌరస్తాలో లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ముత్తన్న మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం మార్పు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఈ కొత్త కోడ్‌ల కారణంగా కార్మికులకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ప్రైవేటు సంస్థల్లో అదనంగా పనిగంటలు పెంచుతూ తీసుకొచ్చిన ఈ చట్టాల కారణంగా కార్మికులు కష్టాలపాలవుతారన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ తీసుకొచ్చిన ఈ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లా కోశాధికారి అర్వింద్, ఆర్మూర్ మండల నాయకులు ఎండీ.నజీర్, ఎన్.నిఖిల్, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా వసతి గృహం తనిఖీ



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, వసతిగృహాన్ని ఎంఈవో బట్టు రాజేశ్వర్ సోమవారం తనిఖీ చేశారు. ఉదయం ఆకస్మికంగా వసతి గృహానికి వెళ్లిన ఆయన విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, వంట గది పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, వసతులను పరిశీలించారు, మెనూ ప్రకారం అల్పాహారం భోజనం అందిస్తున్నందుకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పదోతరగతి విద్యార్థులు పరీక్షలపై శ్రద్ధపెట్టి రాయాలని సూచించారు.

## రేపు పోచంపాడ్‌లో ఆరోగ్య శిబిరం


**అక్షరటుడే: మెండోరా:** పోచంపాడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పీహెచ్‌సీలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని సర్పంచ్ మాధురి రాజు, ఉప సర్పంచ్ సంపంగి సతీష్ తెలిపారు. శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఎముకల వైద్యుడు, స్త్రీల వైద్య నిపుణులు, దంత వైద్యులు తదితర అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని వారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి వేగంగా నిధులు విడుదల చేయిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే మండలంలోని 27 గ్రామాల్లో రూ.20 లక్షల చొప్పున రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత 30ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామీణ రహదారి సమస్యలను పరిష్కరించే దిశగా తీసుకున్న ఈ నిర్ణయాలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కల్యాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం



**అక్షటుడే, బోధన్:** రెంజల్ మండలంలోని కల్యాపూర్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ భానుచందర్, ఎఫ్‌వైఏ సలహాదారు కంఠం బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. యువత బెట్టింగ్, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మంచి మార్గంలో నడవాలని సూచించారు. కల్యాపూర్ గ్రామంలో 12 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది దివంగత మైని అరుణ్ కుమార్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, ఎఫ్‌వైఏ అధ్యక్షుడు మైని సంతోష్, నల్ల నవీన్, కాలేవర్ సంజీవ్, కాశం భారత్,మధు కృష్ణ, లోకేష్, కాశం శ్రీను, సటే శ్రీను, సాకలి సాయినాథ్, సురేందర్, మల్లరి సురేష్, మైని రాజు, కుర్మె ప్రవీణ్, పోతరాజు నరేష్, బిందు, ఐటి సుమన్, గణేష్, పోశెట్టి, మల్లరి ప్రశాంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

## తాడ్వాయిలో రోడ్డు ప్రమాదం.. ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి




**అక్షరటుడే, కామారెడ్డి:** ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. లింగంపేట మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన 12మంది దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలో బంధువుల ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్‌కు బయలుదేరారు. తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్ వేగంగా ఆటో నడపడంతో అదుపుతప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. స్థానికులు గమనించి బోల్తాపడిన ఆటోకింద చిక్కుకున్న వారిని బయటకు లాగారు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన దప్పు పోషవ్వ(70)ను మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దప్పు సాయిలు(57) మృతి చెందాడు. మిగితా వారికి చికిత్స కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ప్రజావాణిలో నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని వివరించి పరిష్కారానికి సీపీ ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవచ్చన్నారు.